# తా వలచినది రంభ

## రంగధామ్

పుట్టి పెరిగిన వాతావరణం గిట్టదు. కొత్తది సృష్టించుకో గలిగిన కండపుష్టి లేదు. అయినా అవ్వా కావాలి, బువ్వా కావాలి ఆ అబ్బాయికి.

పద్మను పెళ్ళి చేసుకొంటే...అన్నీ సమస్యలే. ఇదీ విశ్వం సమస్య.

అలాంటప్పుడు శీను అకస్మాత్తుగా కనుపించి భేషైన సలహా ఇచ్చాడు. తీరా చూస్తే...డామిట్ ! కథ అడ్డంగా తిరిగింది !

"బామ్మా, నా కొలుక్కి అన్నం పెట్టుకోవాలి. పప్పూ బియ్యం ఇత్తావా?" అని మూడేళ్ళ రాధ వంటింటి గుమ్మం దగ్గర నిల్చుని అంటోంది. ఒక చేతిలో అతి జాగ్రత్తగా ఒక చిన్న చందనపు బొమ్మను పొదివి పట్టుకొని, ఇంకో చేత్తో మొహంమీదికి పడిపోతున్న జుత్తును వెనక్కి తోసుకుంటూ, తను మహా ఆత్రుతలో వున్నట్లు మొహం పెట్టేసి నించుంది. రాధకి ఆ చందనపు బొమ్మే కొడుకు.

రాధ బామ్మ పరధ్యానంగా వున్నట్లుంది. ఆవిడకి ఆవేళ ఏకాశి. దేవుళ్ళని తోముకొని, స్నానం చేసి మడిగట్టుకునేటప్పటికి వంట కాలస్యమై పోయింది. తొందరగా వండి కొడుక్కి ఆఫీసు వేళకు వడ్డించాలి. అందులో మనవడు వూరునించి నిన్ననే వచ్చాడు. ఏడాదినుంచీ కాలేజీ చదువు కోసం పరాయివూళ్లో హాస్టలు మెతుకులు తింటున్నాడు. వాడి కిష్టమైన వంకాయ మెంతికారం కూర చెయ్యాలి. మనవరాలు పురిటికి వచ్చింది. నెల బాలింతరాలు. ఆమెకి పథ్యంగా వేరే వండాలి. కోడలు ఇంకా చెరువునుంచి రాలేదు. రాధ మాటలు ఆవిడకి సరిగా విన్పించలేదు.

రాధ మాటలు అప్పుడే నిద్రనుంచి లేచి బద్ధకంగా పక్కమీద పడుకునే ఆలోచిస్తున్న విశ్వానికి విన్పించాయి. పసిపాప వూహలూ, దాని ముద్దు మాటలూ వింటూంటే విశ్వం మనస్సు ఎంతో ఆనందం పొందింది.

రాధ మళ్ళీ అడిగింది. అడుగుతూ పొయ్యి మంట చేసుకుంటున్న బామ్మ దగ్గరగా వెళ్లింది.

"ఓయ్యో! అయ్యో! మడీమైలా లేకుండా వంటింట్లోకి వచ్చి నన్ను ముట్టేసుకుంటావు టే. పొద్దుస్తే నీ కొడుకూ—నువ్వూనూ, చంపుకు తినేస్తున్నావ్. నన్ను ముట్టుకుంటే ఇప్పుడు చచ్చినట్టు చెరువుకువెళ్లి స్నానం చేసి రావాలి. ఓం.... ఇంద, ఈ పప్పు తీసుకొని, ఏవీ తగలకుండా బయటకు వెళ్ళు. రాను రాను ఈ ఇంట్లో అనాచారం ఎక్కువైపోతోందమ్మా" అంటూ, తనకి దగ్గరగా వచ్చి నిలబడ్డ రాధను కేకలేస్తూ, వంటింట్లోంచి బయటకు పొమ్మంటూ, నాలుగు పప్పుగింజలు ఆ పసిదాని చేతిలోవేసింది రాధ బామ్మ.

విశ్వానికి, నాయనమ్మ చిన్నపిల్లని అన్న మాటలు కర్ణకఠోరంగా విన్పించాయి. అంత వరకూ రాధ మాటలవల్ల తనకు కలిగిన ఆనందానుభూతి నాయనమ్మ మాటలతో భగ్నమైంది.

మూడేళ్ల పసిపాపకు మడీ, మైలా ఏం తెలుస్తాయి? నాయనమ్మ, అంత మంచి హృదయంగల మనిషి, ఇలా కేకలేస్తోందేమిటి? ఇంట్లో నాయనమ్మ మాటలు అందరికీ అలవాటే. అందర్నీ అనాచారం చేస్తున్నారంటూ కేకలేస్తూనే వుంటుంది; మళ్లీ అందరికీ బోలెడంత చాకిరీ చేస్తుంది. పిల్లల్ని పక్కల్లో పడుకోబెట్టుకొని ఎన్నో కథలు రాత్రిపూట చెబుతూంటుంది.

చిన్నపిల్ల రాధ కూడా ఆ మాటలు పట్టించుకున్నట్లు లేదు. దాని దృష్టిలో అది వుంది. పెద్దవాళ్లచేత కసుర్లూ, తిట్లూ తినడం పిల్లల కలవాటయిపోయింది. పెద్దవాళ్ళకి ఈ యింట్లో ఇరవైనాలుగు గంటలూ చిన్నవాళ్లని సాధించడం, అదిక్కడ పెట్టావు, ఇదక్కడ పెట్టావు, ఇది పాడుచేశావు, అది పాడుచేశావు అని అనడం అలవాటు. వాళ్లకన్నా చిన్నవాళ్లలో తప్పులు ఎంచడమే తమ పెద్దతనానికి సార్థకంగా భావిస్తారు.

విశ్వం తల్లి చెరువునుంచి వచ్చి "నాయనా లేచావా. మొహం కడుక్కొని, ఫ్లాస్కులో వున్న కాఫీ తాగు" అని చెప్పింది.

ఇంటిమీదా, తలిదండ్రులమీదా పిరితో అభ్యయత పెట్టుకుని వచ్చిన విశ్వానికి, ఆ పేళ ప్రొద్దున్న ఇంట్లో జరుగుతున్న దినచర్య ఏమీ రుచించలేదు. తన కాలేజీ, హాస్టలూ, అక్కడ జీవితంలోని హాయీ జ్ఞాపకానికి వచ్చాయి. అక్కడ స్వేచ్ఛ వుంది. కాని మనలను ప్రేమించేవారెవరూ వుండరు. ఇక్కడ ప్రేమా, అభిమానం అన్నీ వున్నాయి; కాని మనస్సును అనవసరంగా బాధపడేట్టు చేస్తారు.

ఒకరోజంతా ఇంట్లో గడిపేటప్పటికి విశ్వానికి మనస్సు పూర్తిగా పాడైపోయింది. అతను కాలేజీ చదువుకువెళ్లి ఏడాది తరువాత ఇంటికి వచ్చాడని అందరూ అభిమానం, ప్రేమా, ఆప్యాయతా చూపిస్తున్నారు. కాని, మామూలుగా వుండే సాంసారిక వాతావరణం, పెద్దదయిన తల్లి—ఆవిడ కొడుకూ—కోడలూ వాళ్ల మధ్య వుండే పొరుపులూ, అభిప్రాయ భేదాలూ, దృక్పథాల్లో తేడాలూ, ఇవి విశ్వానికి చీదర కలిగించాయి.

పైగా మాటిమాటికీ నాయనమ్మ తనను "అదేమిట్రా, మైలగుడ్డలతోటే భోంచేస్తావా?" అనీ, "ఎంత కాలేజీలో చదువుకున్నా ఆచారం అక్కర్లేదురా?" అనీ, ఏ పని చెయ్యబోయినా తనొక చాతకాని, తెలివితక్కువదద్దమ్మ అన్నట్లు మాట్లాడడం, "ఇప్పటివాళ్లకేం తెలుస్తుంది? మా కాలంలో ఇలాగే మెసిలావా? ఇలాగే పిల్లల్ని పెంచావా?" అని తన తల్లిని, తండ్రిని కూడా అంటూండడం విశ్వం మనస్సు పాడుచేశాయి.

భోజనాలూ, పనులూ అయ్యాక మధ్యాహ్నం తల్లీ అక్కయ్యా తన కాలేజీ చదువు గురించీ, హాస్టలు గురించీ ప్రశ్నలు వేశారు. విశ్వం హుషారుగా జవాబిచ్చాడు. వాళ్లిద్దరూ తన్నొక ఘనకార్యం చేసినవాడిలా చూస్తున్నారు. నాయనమ్మ ఇంట్లో లేదు. పురాణానికి వెళ్లింది. తండ్రి ప్రొద్దున్నగా వెళ్లి, రాత్రి ఎనిమిదింటికిగాని తిరిగిరాడు. విశ్వం తల్లి, కొడుక్కి మధ్యాహ్నం ఉప్మా, కాఫీ చేసిపెట్టింది. విశ్వం రాధతో కొంచెంసేపు ఆడుకున్నాడు. సాయంకాలం బట్టలు వేసుకుని వూళ్లోకి బయల్దేరాడు.

నడుస్తూన్న విశ్వం మనస్సులో అనేక ఆలోచనలు వచ్చాయి. తన చిన్నతనపు రోజులన్నీ జ్ఞాపకానికి వచ్చాయి. అతను ఏడాది క్రిందట స్కూలు ఫైనలు పాసయి ఆ వూళ్ళో కాలేజి లేక పోవడం వల్ల పైవూరికి వెళ్లాడు, ఇంటరులో చేరడానికి.

తను స్కూల్లో చదివిన రోజులు ఎంత హాయిగా గడిచాయి! అప్పటికీ ఇప్పటికీ ప్రపంచం ఎంతో మారిపోయినట్లుంది. తనూ తన స్నేహితులూ ఆడిన ఆటలూ, చెప్పుకున్న కబుర్లూ విశ్వానికి ఒక్కటొక్కటే జ్ఞాపకానికి వచ్చాయి.

చిన్నప్పుడు, అయిదారేళ్ల వయస్సప్పుడు తనూ, శీనూ, రామూ కలిసి తమాషా ఆటలు ఆడేవారు. శీనుగాడింట్లో పెద్ద పందిరి పట్టె మంచం వుంది. దానిక్రింద పాతాళలోకం వుందని శీను చెప్పాడు. వాడు ఆ మంచం కోళ్లకి ముందు



వైపున ఒక తెరకట్టి, వెనకాల తను కూచొని, పాతాళలోకం గురించి అనేక విషయాలు చెప్పే వాడు. అవన్నీ వింటూ తనూ, రామూ గడగడ వణికిపోయేవారు. అక్కడ రాక్షసుల్ని ఎంతమందిని శీనుగాడు చంపాడో లెక్కలేదు.

శీనుగాడింట్లో అటక వుంది. నిచ్చెన వేసు కుని అదెక్కి, దానిమీద దేవలోకం వుందనేవాడు. తనూ, రామూ బ్రతిమాలగా ఎలాగో నిచ్చెన ఎక్కించి దేవలోకంలోకి తీసుకెళ్లాడు. అక్కడ పెట్టెలూ, పాత కొయ్యముక్కలూ, బూజూ, దుమ్మూ తప్ప మరేం లేవు. తమ వూహలో అదే స్వర్గం.

ఆ రోజుల్లోనే రామూ ఒక అద్భుతం చెప్పాడు. అదేమిటంటే, ఒక కానీ మనం దేవుణ్ణి తల్చు కొని భూమిలో పాతామా, అది కొన్నాళ్లకు చెట్టయిపోతుంది. చెట్టు నిండా కాన్లు కాసే స్తాయి. తనూ, శీనూ, రామం చాలా కాన్లు పాతారు. కాని ఒక్కటీ చెట్టవలేదు. కొంపతీసి భూదేవికి తమమీద కోపం వచ్చిందేమోనని మళ్లీ మళ్లీ కాన్లు పాతి భూదేవిని ప్రార్థించే వాళ్లు. భూదేవి తమ మొర ఆలకించనేలేదు.

కొంత వయస్సు, అంటే పది పదకొండేళ్లు వచ్చేటప్పటికి రాజకుమారుడూ, మంత్రికుమా రుడూ ఆటలాడుకునేవాళ్లు. అప్పుడే రాజకుమార్తెగా పద్మ కూడా వీళ్ల ఆటల్లో పాల్గొనేది. ఒకసారి బాలనాగమ్మ ఆట ఆడారు. అందులో తను బాల వర్ధిరాజు, శీనుగాడు మాయలఫకీరు, పద్మావతి బాలనాగమ్మ. శీనుగాడు ఫకీరుగా బాగా తయా రయ్యాడు.

ఆ వయస్సులోనే ఒకసారి మేస్టారు "కాళిదాసు' నాటకం వేయించారు. పద్మావతి కాళిదాసు భార్య గానూ, తనని కాళిదాసుగానూ వేయించారు. చూసిన వాళ్లంతా చాలా బావుందన్నారు. తనకి పద్మావతి చాలా బాగా నటించినట్లు తోచింది. ఆరోజునుంచీ తను పద్మావతి యింటికి వెళ్లడం ప్రారంభించాడు.

ఒకనాడు పద్మావతి వాళ్లింట్లో, వాళ్లక్క పద్మావతికి భోజనంపెడుతూ, తనను కూడా భోజ నం చెయ్యమంది. తను తెలియక భోంచేశాడు. పైగా ఆ సంగతి ఇంట్లో చెప్పేశాడు. అమ్మ "వెధవా, బ్రాహ్మణ పుట్టుక పుట్టి భోగం వాళ్లింట్లో అన్నం తింటావా?" అని తన వీపు మీద నాలుగు అంటించింది. ఇంట్లోవాళ్లంతా తనమీద విరుచుకుపడ్డారు. అప్పటినుంచీ భోగం వాళ్లంటే ఏమిటో తెలుసుకోవాలని తను చాలా తాపత్రయపడ్డాడు. కాని ఎవర్నడగాలో తెలియ లేదు. వయస్సు వచ్చినకొద్దీ విషయాలు అర్థమవ సాగాయి.

విశ్వం కాళ్లు పద్మావతి ఇంటివేపు దారి తీశాయి. విశ్వం మనస్సులో పద్మావతిమీద గొప్ప ఆకర్షణవుంది. కాలేజీ చదువులో తను నేర్చు కున్న విషయాలూ, అక్కడ తన చదువులో గొప్ప తనం అన్నీ పద్మావతిముందు చూపెట్టి, ఆమె నాశ్చర్యపరచాలనే రహస్య కాంక్ష అతని హృద యంలో వుంది.

పద్మావతి ఇంటికెళ్లగానే వాళ్లక్క ముందు

## తావలచినది రంభ

ద్వారం దగ్గర నిల్చుని వుంది. "ఏం పంతులుగారూ వూరినుంచి ఎప్పుడొచ్చారు?" అని పలకరిం చింది.

విశ్వం "నిన్ననే వచ్చా"నని, "పద్మేది?" అని అడిగాడు.

పద్మ అక్క శేషు, విశ్వాన్ని హాలులో కూర్చో మని చెప్పి, మేడమీదికి వినిపించేట్టు, "పద్మా, మీ పంతులుగారొచ్చారే" అని కేకేసి, తను లోపలికి వెళ్లిపోయింది. విశ్వానికి పద్మ ఇల్లు ఎప్పుడు చూసినా, సినిమాల్లో చూపించే శ్రీమంతుల మేడలు జ్ఞాపకమొస్తాయి. వాళ్ల ఇల్లు అంత అందంగానూ, శుభ్రంగానూ వుంటుంది.

మేడమీదనుంచి పద్మ దిగి వచ్చింది. వస్తూనే తనని చూసి చిరునవ్వు నవ్వింది. విశ్వానికి, తన

> తెలుగు క్లాసులో పాఠం వినకుండా పరధ్యానంగాఉన్న గోపిని ఉపాధ్యాయుడు ఇలా అడిగారు:
>
> "సున్న ఉభయాక్షరం ఎలా అయిందో చెప్పరా, గోపీ."
>
> "అది తెలుగులోను, లెక్కలలోను కూడా ఉంది సార్."
>
> —ఎల్. శి. శాస్త్రి (ఉయ్యూరు)

తల్లి, తండ్రి కూడా చూపించని ఆత్మీయత పద్మ చూపించినట్లయింది.

విశ్వం పద్మ చాలాసేపు మాట్లాడుకున్నారు. పద్మ స్కూలుఫైనలు వరకూ చదివి మానేసింది. విశ్వం కాలేజీ చదువుకు వెళ్లాడు.

మొదట్లో కొద్దిక్షణాలు ఇద్దరి మధ్యా కొత్త దనం ప్రవేశించింది. కానీ, కొంచెం సేపటిలో అది మాయమై ఇద్దరి మాటల్లోనూ ఒక ఆర్ద్ర తా, మమతా ప్రవేశించాయి. ఇద్దరి మనస్సులోనూ యౌవ్వనం యొక్క తొలి ఆవేశం తొంగిచూస్తోంది. కొంతసేపు అవీ ఇవీ మాట్లాడాక పద్మని, విశ్వం "నా ఉత్తరానికి జవాబివ్వలేదేం?" అని అడిగాడు.

పద్మ కొంచెం ఆలోచించి, "ఎలా ఇవ్వాలో తెలియక" అంది.

విశ్వం, "నేనేమైనా తప్పు రాశానా?" అని అడిగాడు.

పద్మ, "తప్పుకాదు.....మన స్నేహం....పెరిగి పెరిగి.....ఎంతవరకు వెళ్తుందా? అని—" అంది— బలవంతంగా తన చేత ఎవరో ఆ మాట అని పిస్తున్నట్లు.

విశ్వానికి పద్మ మాట అర్థం కాలేదు. "నాతో స్నేహం చెయ్యొద్దని నీకెవరైనా చెప్పారా?" అని అడిగాడు.

పద్మ "లేదు. కాని, మీరేం చేసినా ఫరవాలేదు. నా విషయం అలాకాదుగా?" అంది.

విశ్వం "సరే. నువ్వేమంటున్నావో అర్థం కాలేదు. నేనంటే నీ కిష్టంలేదని తెలుస్తోంది......నే వెళ్లొస్తా" అని లేచాడు కొంచెం కోపంగా.

పద్మ తల వంచుకుంది. విశ్వం తటపటాయిం చాడు. తల వంచుకున్న పద్మ కళ్లలోంచి రెండు అశ్రుబిందువులు నేలమీద పడ్డాయి. అవి చూసి విశ్వం కరిగిపోయాడు. పద్మకి దగ్గరగా వెళ్లి "పద్మా" అని పిల్చాడు. పద్మ పలకలేదు. విశ్వమే మాట్లాడాడు. "నేను నిన్ను మనస్పూర్తిగా ప్రేమిస్తున్నాను. నువ్వు కూడా ప్రేమించావని తలుస్తున్నాను. నా హృదయంలోని భావాలన్నీ నీకు తెలియపరుస్తూ నీకా ఉత్తరం రాశాను. నువ్వు జవాబివ్వడానికే వీల్లేని కారణం ఏమిటో నాకు తెలియటంలేదు" అన్నాడు.

పద్మ ఏమీ జవాబు చెప్పలేదు.

"ఆ కారణం ఏమిటో నేను చెప్తాను పంతులు గారూ. మీరు బ్రాహ్మణులు. మేము కళావం తులం. మీరు ఏనాడూ మా అమ్మాయిని పెళ్లి చేసుకోరు. ఒకవేళ చేసుకోవడానికి మీ రిష్టపడినా మీ వాళ్లొప్పుకోరు. కాబట్టి పద్మ అనవసరంగా మీతో పరిచయాన్ని వృద్ధి చేసుకుని, మీరు కల్పించే ఆశలకు లొంగిపోదల్చుకోలేదు" అంది వెనకనుంచి శేషు.

విశ్వం ఆశ్చర్యపోయాడు. ఈ యధార్థ ప్రాపం చిక విషయాన్ని తనెప్పుడూ ఆలోచించలేదు. తనూ, పద్మప్రేమా, తమ యిద్దరి అభిరుచుల లోనూ భావాలలోనూ వున్న సారూప్యం, తమ రహస్య కాంక్షల్ని వెల్లగక్కే చూపులూ, చేష్టలూ అవే అతని మనస్సు నింతవరకూ ఆక్రమించాయి. ఇప్పుడు తను వూహించని చోటునుంచి ఒక అస్త్రం వచ్చి తన మనస్సును దూసుకుంది. విశ్వం తెలివితక్కువవా డేమీ కాదు. "నేను మీ చెల్లెల్ని పెళ్లి చేసుకోనని మీరెలా చెప్పగలరు?" అని అడిగాడు శేషుని.

పద్మ తలెత్తి అక్కవైపు చూసింది. ఆమె కళ్లల్లో ఒక గర్వం మెరిసింది. "చూశావా, ఆయన నావాడని చెప్పానా?" అన్నట్లున్నాయి ఆ కళ్లు.

శేషు పద్మ భావాలు గ్రహించి చిన్న నవ్వు నవ్వుకుంది. విశ్వానికి జాగ్రత్తగా సమాధానం చెప్పాలనుకుంది. "పంతులుగారూ! మీరూ నేనూ పద్మా ఏది జరగాలనుకుంటున్నామో అది జరగ డానికి సంఘం ఒప్పుకోదు. మనం ఆ పని చెయ్య గానే సంఘంలో మనను గురించే పెద్ద అలజడి పుట్టుతుంది. మీ యింట్లోనే మీకు వెలి వేస్తారు. మీరు వయస్సులో చిన్నవారు. అనుభవంలేక ఇది చాలా సాధారణ విషయంగా భావిస్తున్నారు. మీ తల్లి తండ్రులు మిమ్మల్ని చాలా మాటలంటారు. వీటికి మీరు తట్టుకోలేరు. మీ యిద్దరి

జీవితం చాలా దుఃఖ భాజనమవుతుంది. మీరు మీ కులంలోని పిల్లని చేసుకుంటే ఇలాటివేమీ వుండవు" అని శాంతంగా చెప్పింది.

విశ్వం వెంటనే ఏమీ మాట్లాడలేదు. అక్కచెల్లెళ్లిద్దరూ అతని వైపు చూశారు. విశ్వం యొక్క యువక మనస్సులో శేషు ఒక తుఫాను రేపింది. అంతవరకూ హృదయంలో పొంగే యౌవన కాంక్షలేగాని, యదార్థ విషయా లతనికి స్ఫురించ లేదు. శేషు మాటలకి తను సమాధానం చెప్ప లేడు. ఆ విషయం బాగా ఆలోచించాలి. అయినా తను మాత్రం పద్మని వదిలి జీవితం గడపలేడు. పద్మని గొప్ప ఆవేశంతో ప్రేమించాడు. ఆ ప్రేమ ఇలాటి పరీక్షకు నిలబడవలసి వస్తుందని వూహించ లేదు.

"ఎన్ని చికాకులొచ్చినా, ఎవరేమన్నా సరే నేను పద్మనే ప్రేమిస్తున్నాను. పెండ్లి చేసుకుంటాను" అన్నాడు.

శేషూ, పద్మా ఇద్దరి ముఖాలూ వికసించాయి. శేషు, పద్మని దగ్గరగా తీసుకొని, "మా పద్మ అదృష్టవంతురాలు" అని, "మీ రిద్దరూ మాట్లాడుతూ వుండండి. కాఫీ కలిపి తెస్తాను" అని లోపలికి వెళ్లింది.

శేషు లోపలికి వెళ్లగానే, పద్మ విశ్వం వైపు చూసి చిన్నగా నవ్వింది. కాని వెంటనే మొహం ప్రక్కకి తిప్పేసుకుంది.

విశ్వం అప్పటివరకూ జరిగిన సంఘర్షణ మరిపించాలని, "ఇంకనుంచీ ఉత్తరాలు రాయడాని కేమైనా అభ్యంతరం వుంటుందా?" అని అడిగాడు.

పద్మ ఆలోచించింది. అక్కయ్య నడగందే తను ఆ విషయం చెప్పడానికి వీలులేదు. ఎందుకంటే అక్కయ్య విశ్వం విషయంలో తననేమీ స్వతంత్రించి వ్యవహరించవద్దని చెప్పింది. పద్మ సహజంగా చాలా తెలివైనదీ, చురుకైనదీ. అయినా విశ్వం ఉత్తరం వచ్చిన దగ్గర్నుంచీ శేషు రాత్రింబగళ్లు పద్మని కూచోబెట్టి, అతనికీ తమకీ వున్న తేడా బోధపరిచింది. అతను పద్మని పెళ్లి చేసుకోవడంకల్ల అని చెప్పింది. అతని ప్రేమ కబుర్లకులొంగి పద్మ ఏమాత్రం మెత్తబడినా, పద్మని గోతిలోత్రోసి అతనిదారి అతను చూసుకుంటాడని చెప్పింది. అవసరం వచ్చినప్పుడు తనే అతనితో ఆ విషయం కదిపి, అతని మనోభావాల్ని కనిపెట్టి అతనితో ఎలా ప్రవర్తించాలో తనకి చెబుతానంది. అందుకని పద్మ "ఏమో, నాకు తెలియదు" అంది.

విశ్వానికి కొంచెం చిరాకు కలిగింది. కాని అతనిలో అది పైకి చూపించగల శక్తి లేదు. ఎందుకంటే శేషు అతనిలో కదిపిన భావాలు చాలా బలంగా అతని మనస్సు నాక్రమించుకున్నాయి. వాటి గురించి అనేక ఆలోచనలు బుర్రలో పరిగెడుతున్నాయి. ఈ—తన—మానసిక బలహీనతను పైకి వెలిబుచ్చకుండా పద్మకి తన యెడలనున్న గౌరవానికి భంగం కలగకుండా ప్రవర్తించాలని అవస్థ పడుతున్నాడు. ఏవో అర్థంలేని మాటలైనా మాట్లాడి తన అంతర్యం ఎదుటివారు కనిపెట్టకుండా కాపాడుకోవాలని ప్రయత్నించాడు. పద్మ తనకు కొంచెం సాయపడితే బాగుండు ననుకున్నాడు.

పద్మ కూడా ఒక విధమైన అవస్థలో వుంది. ఇంతవరకూ, ఆటల్లోనూ, చదువుల్లోనూ వున్న స్నేహం వేరు. ఇప్పుడతను, తనని పెళ్లిచేసుకుంటానని గట్టిగా చెప్పాడు. ఆమె హృదయంలో ఒక వైపున ఆనందం, సిగ్గూ, మరొక వైపున నిజంగా అలా జరుగుతుందా? అనే అనుమానం, ఇకనుంచి ఇతనితో ఎలా ప్రవర్తించాలి—అనే సమస్యా—ఆమెను పట్టుకు లాగుతున్నాయి.

ఇద్దరూ ఏవో ఆలోచనల్లో మునిగిపోయారు. శేషువచ్చి చెరొక కప్పు కాఫీ ఇచ్చేదాకా వాళ్లీ లోకంలో పడలేదు. శేషు వాళ్ల స్థితి గ్రహించింది. శేషు కూడా స్కూలు ఫైనల్‌దాకా చదివింది. తమ కులంలోనే ఒకాయన్ని పెళ్లి చేసుకుంది. శేషుకి పిల్లల్లేరు. చెల్లెలు పద్మనే తన సర్వస్వంగా పెంచింది. పద్మకి పెళ్లి చేద్దామని, మంచి వరుణ్ణి వెతకాలనుకుంటోంది. ఇంతలో విశ్వం, పద్మకి ఒక ప్రేమ లేఖ వ్రాశాడు. అది శేషు చేతిలో పడింది. పద్మని ఆరాతీసి వాళ్లిద్దర్మూ ప్రేమ కలాపంలో పడ్డారని తెలుసుకుంది. అక్కంటే పద్మకి పంచప్రాణాలూనూ. అందుకని శేషు పద్మయొక్క సమస్య ఎలా పరిష్కరించాలా అని ఆలోచిస్తోంది.

విశ్వం కాఫీ త్రాగి "వెళ్లి వస్తా"నని లేచాడు.

పద్మ "పనుందా?" అంది.

విశ్వం "అవును" అన్నాడు.

శేషు "రేపు మళ్లీ తప్పకుండా వస్తారు కదా?" అంది.

విశ్వం "అలాగే" అన్నాడు.

విశ్వం వెళ్లిపోగానే శేషు పద్మని "ఇంకేమైనా అన్నాడా ఆయన?" అని అడిగింది.

పద్మ "ఏమీ లేదు. వుత్తరాలు రాయడానికేమీ అభ్యంతరం లేదుగదా అన్నారు" అని, అక్కని "రాయకూడదా ఏమిటే ?" అని గారంగా అడిగింది.

శేషు నవ్వుతూ, "ఈ సెలవులై ఆయన మళ్లీ వూరు వెళ్లేటప్పటి సంగతి కదా! అంత లోపల ఆ విషయం ఆలోచించలేకపోతామా !" అంది.

ఆవేళ రాత్రి విశ్వానికి నిద్దర పట్టలేదు. శేషు అన్న మాటలు యధార్థమైనవి. అవి విన్న వెంటనే సహజంగా కోపం కలిగినా, జాగ్రత్తగా ఆలోచిస్తే అవన్నీ ఎక్కడైనా జరిగేవే. పదేళ్ల క్రిందట వాళ్ల బంధువు ఒకాయన తమ కులం కాని స్త్రీని వివాహమాడారు. అతనికి తమ కులంలో వెలి అయింది. అతనివల్ల తమ కుల మంతా అప్రతిష్ఠపాలైందని విశ్వం తండ్రి, నాయనమ్మా అనుకొన్నారు. అతను బంధువుల ఇంటికి రావడానికి సిగ్గుపడేవాడు. వచ్చినా అతనికి వంటింట్లో వడ్డించేవారు కారు.

కాని, రోజులు మారిపోతున్నాయి. ఒకప్పుడు సంఘంలో దూష్యం, అపవిత్రం అనిభావింపబడే పనులే నేడు తప్పనిసరిగా ఆచరింపబడుతున్నాయి. అవి చేయగల శక్తి వుంటే చాలు.


సినిమానటులు

మీరు సినిమాలలో నటించి, నెలకు వేలకొలది ఆదాయం పొందవలెనన్నచో నేడే మాకు వ్రాయండి. ఉత్తరప్రత్యుత్తరాలు ఇంగ్లీషు లేక హిందీలో వ్రాయవలెను.

BOMBAY FILM SERVICE
(A.M.W.)PHAGWARA(N.I.)

కావలెను

ఒక తెలుగు పత్రికా కార్యాలయములో పనిచేసేందుకు చిత్రకారులు కావలెను. తెలుగు భాషాజ్ఞానం అత్యావశ్యకము. పూర్తివివరములతో ఈ క్రింది విలాసమునకు వ్రాయకోరడమైనది.

బాక్సు నెంబరు W/21
C/o ఆంధ్రపత్రిక, మద్రాసు-1.

తెల వెండ్రుక లుండవు

రంగులను చూచి మోసపోవద్దు. అది తాత్కాలికము. మా సువాసన "విశ్వకళ్యాన్ తైలం" అనేక వనమూలికలతో ఆయుర్వేదపద్ధతిలో తయారైనది 50 సం॥ల వయస్సువరకు వెండ్రుకలను నల్లగా వుంచును ఇదిగాక మెదడుకు చల్లదనమునిచ్చును ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపకశక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును కొదిగా నెరసవుంటే ఒక సీసా రు 6. 3 సీసాలు రు. 15. సగము నెరసివుంటే ఒకసీసా రు 7. 3 సీసాలు రు 18 పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు 9 లు 3 సీసాలు రు 24 లు పనిచేయ లేదని ఋజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును. కోరినవారికి పూచీ.

INDRA AYURVED BHAVAN,
(A.) P. O. Rajdhanwar (H. Bagh)

మీరు చదువతగినవి

జీవిత రహస్యాలు: మీ దాంపత్య సుఖాభివృద్ధికి అనేక గొప్ప రహస్యాలు గల పుస్తకం వెల రూ. 3-50.

యువతి : యువతులను గురించి మీ రెప్పుడు కనివిని ఎరుగని అనేక కుతూహల విషయాలమయం. వెల రూ. 3-50

సంతానం : దాంపత్య సుఖా లనుభవించుచూ కూడ, గర్భనిరోధానికి 60 నవీన మార్గాలు. వెల రూ. 3-50.

దేశసేవ ప్రచురణలు

ఏలూరు, ఆంధ్రకు వ్రాసే అసలు ఖరీదుకే వి.పి. ద్వారా మీయింటికి పంపబడును.

# తావలచినదిరంభ

తాను పద్మని పెళ్ళిచేసుకోడానికి తన వాళ్ళెవరూ అంగీకరించరు సరికదా, తనని ముందర తనవాళ్ళే గెంటేసి, వెలివెట్టి, తనమీద కక్ష గట్టుతారు. తను, తనవాళ్ల యిష్టం ప్రకారం వాళ్ళు కట్టబెట్టిన పిల్లను చేసుకుని, సంఘంలో పరువూ, ప్రతిష్ఠ నిలబెట్టుకోవడానికి ప్రయత్నించడమో, లేక ప్రేమించిన పద్మని పరిణయమాడి, తాను కంటున్న ప్రణయ స్వప్నాల్ని యథార్థం చేసుకోవడమో, ఈ రెంటిలో ఏదో ఒకటి నిశ్చయం చేసుకోవాలి. ఈ రెండు పనులలో కూడా కొంత మంచీ, కొంత చెడ్డా వున్నాయి. తను అందరిమాదిరిగా పెద్దల ఆజ్ఞానువర్తియై ప్రవర్తిస్తే జీవితాంతం ప్రేమ మాధుర్యాన్ని కోలుపోతాడు. తను తెగించి పద్మను చేసుకుంటే, కన్న తల్లిదండ్రులకే దూరమవుతాడు. అది తను



భరించగలడో, లేడో వూహించలేకపోతున్నాడు.

విశ్వం ఆలోచనలు ఎటూ తెగలేదు. చివరకు కొన్నాళ్ళవరకూ ఈ సమస్యను పరిష్కరించడం వాయిదా వెయ్యాలనుకొన్నాడు.

సెలవు రోజుల్లో ప్రతి రోజూ సాయంకాలం పద్మ ఇంటికి వెళ్ళేవాడు. తనూ, పద్మా మేడ మీది గదిలో కూచొని 'కారమ్సు' ఆడడం, రేడియో ప్రోగ్రాములు వింటూ, కబుర్లు చెప్పుకోవడంతో కాలం గడిపేవారు. శేషు కూడా వాళ్ళ హద్దు మీరకుండా వుండేట్లు చూస్తూ, వాళ్లతో కాల క్షేపం చేసేది.

విశ్వం ఇంటిదగ్గర, విశ్వం పద్మ యింటికి తరుచుగా వెళ్తున్నాడని తెలిసి, తల్లీ నాయనమ్మా అడిగారు. విశ్వం తను మామూలుగా స్నేహితురాలని వెళ్తున్నానన్నాడు. కాని తన మనస్సులో విషయం చెప్పలేదు.

నాయనమ్మ మెల్లిగా అంటించింది — "ఎంత స్నేహితురాలైనా అంత తరుచూ వెళ్ళకూడదు నాయనా. లోకం, మనం అనుకున్నట్లు అనుకోదు."

విశ్వానికి కోపం వచ్చింది. కాని తను కోపం బయటికి కక్కితే ఇంట్లోవాళ్ల అనుమానాలు మరీ వృద్ధవుతాయి. ఇంట్లో వాగ్యుద్ధాలు పెరుగుతాయి. అతని కటువంటివి ఇష్టం వుండవు. ఆడవాళ్లతో అంతర్యుద్ధం జరపడం అంటే అతనికి తగని విసుగు. బయట మగవాళ్లతో ఎంత దెబ్బలాటకైనా సిద్ధం. అందులో నాయనమ్మ మాటల్లో అఖండురాలు. కాలికివేస్తే మెడకీ మెడకివేస్తే కాలికీ వేస్తుంది. అందుకని విశ్వం తన కోపాన్ని తనలోనే అణచుకొని, "అలాగే మానేస్తాలే నాయనమ్మా" అన్నాడు. తల్లి మొహంలోనూ, నాయనమ్మ మొహంలోనూ సంతోషం కన్పించింది.

విశ్వం మనస్సు మాత్రం నిరంతరాలోచనతో నిండిపోయింది. నాయనమ్మా, తల్లీ, తండ్రీ, వీళ్ళంతా తనమీద వాళ్ళకేదో అధికారం వున్నట్టూ, తన బాగోగులు తనకన్నా వాళ్ళే బాగా నిర్ణయించగలరన్నట్టూ మాట్లాడుతారు. ఇంట్లో వున్నంత సేపూ అతనికి వుక్కిరి బిక్కిరిగా వున్నట్లుండేది. పద్మ ఇంటికి వెళ్ళితే హాయిగా వూపిరిపీలుస్తున్నట్లుండేది. ఒక్కొక్కప్పుడు "నా వాళ్ళందర్నీ వదులుకొని నేనేం బావుకుంటాను?" అనుకునేవాడు ఇంకొకసమయంలో జీవితాంతం పద్మ లేకుండా విషాదమయంగా గడపాల్సిందేనా! అని విచారించేవాడు.

సెలవులయిపోవడం, విశ్వం కాలేజీకి వెళ్లిపోవడం జరిగింది. తను వెళ్ళుతునప్పుడు పద్మా, శేషూ ఎంతో అభిమానాన్ని చూపించారు. పద్మ కన్నీళ్లు పెట్టుకుంది. ఇంట్లో కూడా తల్లీ, తండ్రీ, నాయనమ్మా తనమీద గాఢమైన ప్రేమని వ్యక్తపరిచారు. అతని మనస్సు మళ్లీ వూగులాటలో పడింది.

కాలేజీకి వెళ్లి వస్తున్నా, విశ్వంలో హుషారు లేదు. ఒక వైపున పద్మా, మరొక వైపున తన తలిదండ్రులూ తనను పట్టుకులాగుతున్నట్లుండేది. తన బాధంతా ఎవరితోనైనా చెప్పుకుని, హృదయాన్ని తేలిక చేసుకుందామనుకొన్నాడు. ఎవరైనా తనకి తగిన సలహా ఇస్తే బావుండుననిపించింది.

ఒకనాడు విశ్వం కాఫీహోటలులో కూర్చొని, కాఫీకి ఆర్డరిచ్చి ఆలోచిస్తూ, సర్వరు కాఫీ తెచ్చి పెట్టిన విషయం కూడా గమనించలేదు. ఇంటి విషయాలూ, పద్మ గురించిన ఆలోచనలూ మనస్సు నాక్రమించి, చాలాసేపు పరధ్యానంగా వున్నాడు. భుజంమీద ఎవరో చెయ్యివేసి, "ఏమిట్రా బ్రదర్ దీర్ఘాలోచనలో పడ్డావు?" అని అడిగేదాకా విశ్వం తేరుకోలేదు.

విశ్వం గబుక్కున చూస్తే, తన బాల్య స్నేహి









# తా వలచినది రంభ

తుడు శీనూ రూపం, బల్లమీద ఖాళీ చేయబడిన కాఫీ కప్పూ కన్పించాయి. శీను పకపక నవ్వుతూ, "నేనే ఖాళీ చేశానురా, మళ్లీ ఇంకో దానికి ఆర్డ రిచ్చానులే" అన్నాడు.

విశ్వానికి శీనును చూడగానే ప్రాణంలేచి వచ్చి నట్లయింది. అయిదారేళ్లక్రితం శీను తండ్రికి మరో వూరు బదిలీ అయి వెళ్లిపోయారు, వాళ్లు. అప్పటినుంచి తా మిద్దరూ కలుసుకోలేదు. ఇప్పుడు శీను అంతర కళాశాలల ఫుట్‌బాల్ పోటీలలో పాల్గొనడానికి, విశ్వం కాలేజీ వూరు వచ్చాడు. శీను మంచి ఫుట్‌బాల్ ఆటగాడు.

ఇద్దరూ చాలాసేపు మాట్లాడుకున్నాక, విశ్వం శీనును తన గదికి తీసుకువెళ్లి రెండురోజులు తనతో గడపమని కోరాడు. శీను అందుకు అంగీక రించాడు. శీను చాలా చురుకైనవాడు. మంచి చొరవ, తెలివి కూడా వున్నవాడు.

విశ్వం, శీనూ రాత్రి కబుర్లు చెప్పుకుంటూ, ప్రేమ విషయాల్లోకి దిగారు. విశ్వం శీనుతో తన ప్రేమవిషయమంతా చెప్పాడు. పద్మను ఎలా తను ప్రేమించినదీ, ఎలా తను పెండ్లి చేసుకుంటానని వాగ్దానమిచ్చిందీ చెప్పాడు. పద్మని వదిలి తను జీవించలేనన్నాడు.

శీను విశ్వంయొక్క మొహం తదేక దృష్టితో చూస్తూ, "ఒరేయ్ విశ్వం, నువ్వు పద్మని ప్రేమించి పెళ్లిచేసుకుంటే సంతోషమే. కాని పద్మలో ఏం చూసి నువ్వు ప్రేమిస్తున్నావు?" అని అడిగాడు.

విశ్వం "పద్మ చాలా అందమైనదిరా. దానితో మాట్లాడుతుంటే ఏదో లోకానికి తేలిపోతున్నట్లుం టుందిరా" అన్నాడు.

శీను "పద్మ ఇంటికి చిన్నప్పుడు వెళ్లేవాడిని. చాలా శుభ్రంగా, అందంగా అలంకరించి వుం టుంది. వాళ్లక్కకు మంచి 'ఆర్టిస్టిక్ టేస్టు' వుంది. కానీ పద్మ మనస్సు పూర్తిగా వికసించి, నిన్ను పెళ్లిచేసుకోవడంవల్ల రాబోయే పరిణామా లన్నిటినీ గ్రహించ గలిగిందా? అని నా అను మానం" అన్నాడు.

విశ్వం మనస్సులో కూడా, వివాహానంతరం— తనూ, పద్మా కలిసి తమ బంధువుల అభిప్రాయా నికి వ్యతిరేకంగా ప్రవర్తించి—జీవితాన్ని సుఖంగా గడపగలమా! అనే సందేహం మెదులుతూంది. శీను మాటలు విని, శీను తన నర్మం చేసుకున్నాడని భావించి, "అందుకనే నిన్ను సలహా అడుగుతున్నా నురా. ఇటు తలిదండ్రులూ—సంఘం—వీరి నెలికి లెక్కచెయ్యకుండా సంస్కరణభావంతో పద్మని పెళ్లి చేసుకోవడమా, లేక నా జీవితాంతం పీళ్లకులొంగి, నేనాశించిన సుఖాన్ని కోల్పోవడమా? ఏదో ఒకటి తేల్చారిరా" అన్నాడు.

శీను "ఒరేయ్, నేను కొన్ని విషయాలు చెబుతా విను. మనవి పరమ ఛాందస కుటుం బాలు. మనిళ్లల్లో ముసలివాళ్లదే రాజ్యం. వాళ్ల చేతిలోవున్న అస్త్రాలు—మడీ, దేవుడూ, ఆచారం. మనం వాటి ప్రభావానికి లొంగివుండాల్సిందే,

ఒకవేళ వాటికి లొంగక తిరగబడ్డామా, మనల్ని దైవభక్తిలేనివాళ్ళుగానూ, తల్లి తండ్రులయందు గౌరవంలేనివాళ్ళుగానూ చూచి, మనల్ని అణచి వెయ్యాలని చూస్తారు. అటువంటి వాతావరణంలోంచి మనకు ఎప్పుడు విముక్తి కలుగుతుందా అని ఎదురుచూస్తూంటాం. పద్మ పెరుగుతున్న వాతావరణంలో శుభ్రం, సౌందర్యం, కళ, విజ్ఞానం వీటికి ప్రాధాన్యం వుంది. మన లాంటి యువకులకి అవి ఎంతో వాంఛనీయంగా గోచరిస్తాయి. మనం నివసిస్తున్నది ప్రాచీన నూతన భావాలకు, సంఘర్షణ జరుగుతున్న కాలం. నేటి వైజ్ఞానిక పరిణామాల్ని దృష్టిలో వుంచుకొని మనం మన ఛాందసత్వానికి స్వస్తి చెప్పాలి'' అన్నాడు.

విశ్వానికి శీను చెప్పింది నచ్చింది. ''నిజమేరా. సెలవలికి మా వూరు వెళ్తే, ఒక నిమిషం కూడా మాయింట్లో వుండ బుద్ధికాదు. పద్మ ఇంటికి వెళ్ళితే హాయిగా వున్నట్లనిపిస్తుంది'' అన్నాడు.

శీను ''నువ్వెప్పుడైనా పెళ్ళి చేసుకుంటే చదువుకున్న అమ్మాయిని చేసుకో'' అన్నాడు.

విశ్వం ''ఎందుకు?'' అని అడిగాడు.

శీను ''నీకు కావలసిన వాతావరణాన్ని కొంతైనా సృష్టించగలదు. స్త్రీయొక్క విద్యకు ప్రయోజనం సంసారంలో చక్కని వాతావరణాన్ని సృష్టించడమె. గృహాన్ని పోషించే బాధ్యత పురుషుడిది. గృహాన్ని సృష్టించి, దాన్ని సరిగా వుంచి, అందులో తన ''పర్సనాలిటీ''ని ప్రతిబింబింపజేసే బాధ్యత స్త్రీది. చదువుకున్న ఆడదైతే కొంతైనా ఈ వైజ్ఞానిక ప్రపంచంతో సంబంధం కలిగివుంటుంది. తన విజ్ఞానాన్ని కొంతైనా గృహ నిర్వహణలో వినియోగిస్తుంది'' అన్నాడు.

విశ్వం, ''నిజమేలే. అందుకే పద్మవల్ల నేనా కర్షింపబడ్డాను. ఆమె అవన్నీ నాకు సమకూరుస్తుందనీ, ఆమెవల్ల నా జీవితం ఆనందమయమవుతుందనీ నేననుకుంటున్నాను'' అన్నాడు.

శీను ''ఒరేయ్, నే నొక ప్రశ్న అడుగుతా చెప్పరా?'' అన్నాడు.

విశ్వం, ''అడుగు'' అన్నాడు.

శీను, ''పద్మ నిన్ను ప్రబలంగా ఆకర్షించిన కారణాలేవో తెలుస్తున్నాయి. అందుకని పద్మ బదులు మరొక చక్కని అమ్మాయి—మన కులంలోనే, చదువుకున్నదీ, అందమైనదీ, మంచి వాతావరణంలో పెరిగినదీ లభిస్తే నువ్వు పెళ్ళి చేసుకుంటావా? ఎందుకంటే అప్పుడు నీ కోరికా నెరవేరుతుంది. మీ వాళ్ళ గోలా వుండదు'' అన్నాడు.

విశ్వం కొంచెంసేపు ఆలోచించాడు. శీను చిన్నప్పటినుంచీ విశ్వంకన్నా తెలివైన ఆలోచనలు చేసేవాడు. విశ్వంకి శీను చెప్పిన మాటలు బాగా నచ్చాయి. తను పుద్రేకంలో ఎంత పొరపాటు చేద్దామనుకొన్నదీ స్పష్టమైంది. కాలేజీలో శాంత అనే అమ్మాయి వుంది. తమ శాఖే. ఆమె కూడా తన హృదయాన్ని ఆకర్షించింది. తను శాంతను చేసుకుంటే ఎవ్వరూ ఏమీ అనరు. కానీ పద్మని చేసుకుంటే వచ్చే పెలి కష్టాలూ అన్నిటినీ తట్టుకోవడం కష్టం. అందుకని విశ్వం ''నిజమేరా.




చిత్రకారుడు—కె. భగవాన్ (తాడేపల్లి)

అటువంటి అమ్మాయి కనిపిస్తే తప్పక చేసుకుంటాను'' అన్నాడు.

శీను ''కన్పిస్తుందిరా. మన కులంలో కావలసినంత మంది అందమైన అమ్మాయిలూ, చదువుకున్న వాళ్ళూ, పెళ్ళికాకుండా వుంటున్నారు. నువ్వు వాటికోసం ఇంకో కులందాకా పరుగెత్తడమెందుకో నా కర్థం కాలేదు'' అన్నాడు.

విశ్వం మనస్సు చాలా వరకూ తేలికైంది. తను అంతర్యంలో దేనిని కోరుతున్నాడో ఆ సలహానే శీను చెప్పాడు. విశ్వం, శీను అంతర్యాన్ని గ్రహించలేకపోయినా, తనలోతాను చాలా సంతోషించాడు. తను ఇన్నాళ్ళబట్టీ పడ్తున్న అవస్థ స్వయంకృతం అనుకున్నాడు. శీను చెప్పినట్లు ఎవరో ఇతర కులాల అమ్మాయిని ఉద్ధరిద్దామని భావించే బదులు తమ కులంలోనే తనకు కావలసిన, నచ్చిన, గుణాలుకల అమ్మాయిని పెళ్ళిచేసుకుంటే ఈ రోజుల్లో ఆడపిల్లల తలిదండ్రులు పడుతున్న బాధను చూస్తే, అదే ఒక ఘన కార్యంలా కన్పిస్తోంది.

విశ్వం, శీనూ చిన్నప్పటి కబుర్లనేకం చెప్పుకొని చాలా రాత్రి పోయాక నిద్ర పోయారు.

మూడేళ్ళ తరువాత ఒకనాడు విశ్వం మెడికల్ కాలేజీ హాస్టల్లో, తన రూములో ప్రొద్దున్నే కాఫీ త్రాగి, ఎదురుగుండావున్న ఒక సినిమా తార ఫోటోను తదేకదీక్షతో చూస్తూ, బాగా దువ్విన తలకే బ్రష్‌తో మెరుగులు దిద్దుతున్నాడు. ఇంతలో హాస్టల్ నౌకరువచ్చి రెండుత్తరాల నిచ్చి వెళ్ళాడు. ఒకటి తండ్రిదగ్గర్నుంచి, ఆత్రుతగా విప్పి చూశాడు. అందులో ఇలా వుంది:

నరసన్నపేట,

చిరంజీవి విశ్వానికి, 13—9—59.

ఆశీర్వదించి వ్రాయునది. నీవు తాసిల్దారుగారి పిల్లను చూచివచ్చి, నచ్చినదని చెప్పిన తరువాత మేము వ్రాసిన ఉత్తరము చూచుకొని ఆయన వచ్చినారు.

తనకు ఈ కూతురొక్కతే సంతాన మగుట వలన, ఆయన 'రేడియో మోడలు'లో కట్టించిన స్వగృహము కూతురికే చెందుననియూ, (తన అనంతరం), నీ డాక్టరు చదువు కయ్యే ఖర్చంతా తానే భరించెదననియూ చెప్పినారు. ప్రస్తుతం రెండు వేల రూపాయలు కట్నం ఇచ్చి లాంఛనాలన్నీ జరిపిస్తానన్నారు. ముహూర్తం నిశ్చయించి రాస్తాను.

నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూచుకొనవలెను.

ఇట్లు,

జగన్నాథం.

విశ్వానికి చాలా ఆనందం కలిగింది. తాసిల్దారు గారమ్మాయి శాంత చాల అందంగా వుంటుంది. చదువు కొన్నది కూడాను. వాళ్ళ యిల్లు ఆధునిక పద్ధతిలో వుంటుంది. పైగా తన డాక్టరు చదువు ఏ ఇబ్బందీ లేకుండా జరిగిపోతుంది.

విశ్వం శాంతను తల్చుకుంటూ సినిమాతార ఫోటోవేపు చూశాడు. ఫోటో ''మీ మొగాళ్ళంతా ఇంతే. ఆడదాని సొమ్ము మీద బ్రతకాలని చూస్తారు'' అని అంటున్నట్లుగా వుంది. విశ్వం చిరునవ్వు నవ్వుకున్నాడు. ''డబ్బు చేతిలో లేనప్పుడు ఎలాగో ఒకలాగ దొరికితే చాలుననిపిస్తుంది. డబ్బు దొరికాక ఈ ఎంపుళ్ళు అన్నీ వస్తాయి'' అనుకున్నాడు.

ఇంతలో రెండో ఉత్తరం అతని దృష్టి నాకర్షించింది. అడ్రసు దస్తూరీనిబట్టి తన స్నేహితుడు శీను దగ్గర్నుంచి అని గ్రహించాడు. ఆత్రుతగా కవరు చింపాడు. ఒక ఉత్తరం, చిన్న శుభలేఖా అందులో వున్నాయి. శుభలేఖ వెనక్కివుంచి ఉత్తరం చదవటం మొదలెట్టాడు.

(61-వ పేజీ చూడండి)

# తావలచినదిరంభ

(23-వ పేజీ తరువాయి)

"డియర్ విశ్వం,

నేను పెళ్లి చేసుకుంటున్నానని తెల్పడానికి ఇందులో పంపుతున్న శుభలేఖ ఒక్కటే చాలును. కాని, ఒకప్పుడు నువ్వూ నేనూ వర్ణాంతర వివాహాలపై చర్చించాం. ఆనాడు నువ్వొక భోగం పిల్లను పెళ్లి చేసుకుంటానంటే, నేను నీకొక సలహా నిచ్చాను. అందువల్ల ఆనాటి నా మాటల్నీ, ఈనాటి నా చర్యనూ సమన్వయించుకొనవలసిన అవసరం వుండినందున నీకీ ఉత్తరం రాస్తున్నాను.

ఆనాడు నీకటువంటి సలహా నివ్వడానికి కారణం అప్పటి నీ మనస్థితి. మానసికంగా నీవు నీ స్వగృహ వాతావరణంతో విసుగెత్తి వున్నావు. అందువలన నువ్వొక మార్పు కోరుతూ, పద్మని వివాహం చేసుకుంటే అది లభిస్తుందని ఆశించావు. మనలాంటి యువకులంతా ఈ పాత వాతావరణం వదిలిపోయి, మన జీవితాలలో నూతనత్వం రావాలని ఆశిస్తున్నారు. కాని దానికోసం ఏవో మనం పూర్తిగా హర్షించలేని పనులుచేసి, తప్పించుకోవాలనుకోవడం ఒక రకమైన "ఎస్కేపిజమ్" లాంటిది. మనలో పూర్తి పరిణామం వచ్చిననాడే మనం నూతన సంఘాన్ని సృష్టించగలం.

నీకు పాత వాతావరణం వదిలిపోవడానికి పద్మనే వివాహమాడక్కరలేదనీ, మన కులంలోనే ఒక చక్కని, చదువుకున్న అమ్మాయిని చేసుకోమనీ చెప్పాను. ఎందుకంటే నీకు పద్మని పెళ్లి చేసుకోవాలని వున్నా, దానివల్ల వచ్చే పరిణామాల్ని నువ్వు ఎదుర్కొనడానికి జంకుతున్నట్టు నాకు తట్టింది. పైగా నీ దృష్టిలో, దానివల్ల నువ్వు, పద్మని ఉద్ధరిస్తున్నట్టూ, సంఘ సంస్కరణ చేస్తున్నట్టూ, నీ తల్లితండ్రులకు దూరమయ్యే మహత్తర త్యాగం చేస్తున్నట్టూ వుంది. నీ మాటల ద్వారా, నువ్వు ఈ కార్యాన్ని చెయ్యలేవనీ, చేసినా నువ్వూ, పద్మా జీవితాంతం ఒకరి నొకరు సాధించుకుంటారనీ నేను గ్రహించాను. అందువలననే నిన్నాపని చెయ్యవద్దని సలహా నిచ్చాను. అది నువ్వు పాటించినట్టూ, నీ వివాహం నిశ్చయమైనట్టూ మీ నాన్నగారి ద్వారా తెలిసింది.

ఇప్పుడు నేను చెప్పబోయే విషయమేమిటంటే, ఆ సలహా నీ కోసమూ, నీలాటి వ్యక్తుల కోసమూ ఇచ్చినదేగాని, నా నిజమైన వుద్దేశం అది కాదు. అందువల్ల నా స్వంత అభిప్రాయాల్ననుసరించి నేను పెళ్లి చేసుకుంటున్నాను.

అసలు, ఇది ఎలా జరిగిందంటే ఈమధ్య మా నాన్నకి మళ్లీ మన వూరు బదిలీ అవడంవల్ల సెలవలకి అక్కడికివెళ్లి మోటారు సైకిలుమీద తెగ తిరుగుతుండేవాణ్ణి. ఒకనాడు మంచి స్పీడులో పోతూండగా ఒక చిన్న సందులో మలుపు తిరుగుతూ ఒక ఇంటి ముందు గోడకు 'డాష్' ఇచ్చేశాను నేను సైకిలుమీదనుంచి ఎగిరి, పదిగజాల దూరంలో పడిపోయి, స్పృహ తప్పిపోయాను. అప్పుడు చాలా గొడవ జరిగి వుంటుంది. కాని నాకేమీ తెలియదు.

కళ్ళు తెరిచేటప్పటికి నేను స్వర్గంలో వున్నానో, మరే లోకంలో వున్నానో తెలియలేదు. ఎందుకంటే చక్కని మేడమీద గదిలో, అందమైన మంచం మీద, తెల్లని పరుపుపై నేను పడుకుని వుండగా నా ప్రక్కన రంభ (తరవాత తెలిసింది రంభ కాదటగానీ, రంభకు వారసురాలేనట) కూచొని తళుక్కని మెరిసే కళ్లతో నన్ను జూస్తూ, "ఏమండీ, ఎలావుంది? కాఫీ త్రాగుతారా?" అని అడిగింది.

కాఫీ త్రాగిన తరువాత మరి జీవితంలో భగవంతుడిచ్చిన ఈ 'ఛాన్సు' వృథా చేసుకోకూడదని, ఆ రంభని పరిచయం చేసుకోవడమే కాకుండా, "నిన్ను పెళ్లి చేసుకోవాలని వుంది " అని చెప్పాను. రంభ సిగ్గు పడింది. నేను ముందూ వెనకా చూడకుండా, రంభని దగ్గరకు లాక్కొని, ముద్దెట్టుకున్నాను.

తరువాత రంభ అక్కయ్యవచ్చి గోల పెట్టింది. ఏదో—వాళ్లింటిముందర మోటారు సైకిలు ప్రమాదానికి గురై, పడిపోయానని జాలి దల్చి ఇంట్లోకి తీసుకువచ్చి వుపచారాలు చేస్తే ఈ వెకిలి చేష్టలేమిటంది. నేను వెంటనే లేచి, "ఈ పిల్లని నా కిచ్చి పెళ్లి చేస్తారా? లేకపోతే ఈ మేడ మీదనుంచి క్రిందకు దూకమంటారా?" అని అడిగాను.

నేనలా అనగానే అక్కా చెల్లెళ్లిద్దరూ, ఒకరి మొహం ఒకరు చూసుకొని నవ్వుకొన్నారు. దాంతో వాళ్ళిద్దరూ అందు కంగీకరించినట్టు స్పష్టమైంది. రంభ అక్క, పెద్దవాళ్లతో మాట్లాడి ముహూర్తం నిర్ణయించమంది. రంభకి కూడా అలాటి చాదస్తం ఉన్నట్టున్నాయి. నేను, నాకాబోయే భార్యను తృప్తిపరచాలని, "సరే" నన్నాను.

నా గాయాలు రెండు రోజుల్లో మానిపోయాక మా యింటిదగ్గరికి ఆ అమ్మాయిని తీసుకువెళ్లి, మా నాన్నకి చూపించి, మే మిద్దరం పెళ్లి చేసుకోబోతున్నామని చెప్పాను. మా నాన్న సరే నన్నారు. అమ్మ కూడా ఒప్పుకుంది. ఆ అమ్మాయిది భోగం కులం అని వాళ్లకు తెలుసు.

వాళ్ళు అంత సులభంగా ఎలా ఒప్పుకున్నారా? అని నువ్వు ఆశ్చర్యపడవచ్చు. మా నాన్న పరమ ఛాందసుడని నీకు తెలుసు. ఆయనకు తెలియని శాస్త్రాలూ, పురాణాలూ లేవు. కాని ఆయన ఏమాత్రం అడ్డు పెట్టలేదు. ఆయన అడ్డు పెట్టినా నేను లక్ష్యం చెయ్యనని ఆయనకు తెలుసు

ఎందుకంటావా, సమాజం నానాటికి ముందుకు పోతూంది. వర్ణవ్యవస్థగానీ, మరి ఏ యితర మత వ్యవస్థగానీ, సమాజాన్ని బాల్యావస్థలో సరియైన దారిలో ముందుకు తీసుకుపోవడానికే పుట్టాయి. కాని సమాజం కొంత ఎదిగిన తరువాత అవి అనవసరం.

మనం చిన్నప్పుడు, పాతాళలోకం, దేవలోకం, ఆటలు ఆడుకునేవాళ్లం. ఆ వయస్సుకు, ఆ వ్యూహాలు గొప్పవిగా కన్పిస్తాయి. పెద్దయిన తరువాత హాస్యానికైనా మా పందిరిపట్టె మంచం క్రింద పాతాళలోకం వుందంటే, ఎంత అసహ్యంగా వుంటుంది. ఆనాడు చిన్నతనంలో మనకు అంత స్పష్టంగా ప్రత్యక్షమైనవన్నీ, మనం వయస్సుతో కొన్ని సంవత్సరాలు పెరగగానే, అవి చాలా నిస్సారమైన అబద్ధాలకింద రుజువైపోతాయి.

నేడు సంఘం చాలా ముందుకు వెళ్లింది. వర్ణవ్యవస్థను మనం నిరసిస్తున్నాం. అందులోంచి ఎలాగైనా బయట పడాలని చూస్తున్నాం. అది మన సమాజంయొక్క 'బాల్యం'లో ఉపకరించిన అబద్ధమని తెలుసుకొని, నేడు మనం విజ్ఞానాన్ని పెంపొందించుకొని, పురాతన ఛాందస భావాల్ని వదిలించుకొంటున్నాం.

నేను ఆ పిల్లనే ప్రేమించాను కాబట్టి పెళ్లి చేసుకుంటున్నాను. ఆమెను వుద్ధరిస్తున్నానని అనుకోను. పైగా రంభ తప్ప ప్రపంచంలో ఇంతవరకూ నాకు నచ్చరు, నచ్చబోరు అనుకొని ఆమెను వివాహమాడుతున్నాను.

ఒకవేళ సంఘంలో కొంతమంది చీడ పురుగులు మమ్మల్ని వెలివేస్తారా—వాళ్ళే పోడిపోతారు. ఆర్థికంగా మాకేమీ లోటు లేదు. నేటి సంఘ వ్యవస్థలో ఆర్థికంగా బలవంతులైన వాళ్లదే అగ్రస్థానం. లేదూ—సోషలిజమే వస్తే—అప్పుడే వర్ణ సమస్యేలేదు రంభ ఒకవేళ భోగం పిల్లకాకపోవచ్చు. ముస్లింకానీ, క్రిస్టియన్‌కానీ, ఏ మతమైనాకానీ, నా రంభకాక తప్పదు.

అన్నట్టు ఈ రంభ ఎవరోకాదు నీకు కూడా స్నేహితురాలే. మన పద్మ. ఈ అయిదారేళ్లలోనూ ఎంతో మారిపోయి, చాలా అందంగా, నాజూకుగా తయారైంది. మా వివాహానికి నువ్వు తప్పక రావాలి.

ఇట్లు

నీ శీను"

విశ్వానికి విశ్వమంతా గిర్రున తిరుగుతున్నట్లయింది. తన స్నేహితుడు శీను—ఆనాడు పరధ్యానంలో తను తాగడం మానేసిన—తన కాఫీ త్రాగేసి తనకోసం వేరొక కప్పు కాఫీకి, తన ఖర్చుమీదే ఆర్డరిచ్చాడు. ఈనాడు తను ప్రేమించి, కలలుగన్న యువతిని తన కళ్లముందరే ఎత్తుకుపోయి, పెళ్లి చేసుకుంటున్నాడు. చిన్నప్పుడు తామందరం కలిసి వేసిన "బాల నాగమ్మ" నాటకంలో శీను మాయల ఫకీరు వేషం వేశాడు జీవితంలో కూడా వాడు తన పాలిటి 'మాయల ఫకీరు'గానే మారాడు

పద్మలోవున్న అందం, ఆకర్షణా ఎవర్నైనా మైమరిపిస్తాయి. అందుకే పద్మని చూసీ చూడగానే శీను పెళ్లి చేసుకుంటానని వుంటాడు. మూడేళ్ల క్రిందటే తను పద్మని పెళ్లాడదామనుకొన్నాడు. కాని తెగింపు లేక పోయింది.

విశ్వం ఆలోచిస్తూ, సినిమాతార ఫోటో వైపు చూశాడు. ఫోటోలో లమె, "ఏదైనా చెయ్యి జారిపోయిం తరువాతే దాని విలువ తెలుస్తుంది' అన్నట్టుగా చూసింది ★